# ముగిసిన దుర్గామాత విగ్రహాల నిమజ్జనం


ఆర్మూర్‌లో అమ్మవారి వేషధారణలో నృత్యం చేస్తున్న మహిళ


కందకుర్తి గోదావరినదిలో దుర్గామాతలను నిమజ్జనం చేస్తున్న భక్తులు


కోటగిరిలో దేవీమాత శోభాయాత్ర..


మోస్రా లో 51 ట్రాక్టర్లతో దేవీ అమ్మవార్లను శోభాయాత్రగా తరలిస్తున్న గ్రామస్తులు

## మోస్రాలో 51 ట్రాక్టర్లతో అమ్మవార్ల శోభాయాత్ర

చందూర్/ ఇందల్వాయి / కోటగిరి/ఆర్మూర్/రెంజల్, అక్టోబర్ 25 : మోస్రాలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 51 దేవీమాత అవతార విగ్రహాలను నెలకొల్పారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న అమ్మవార్లకు.. బుధవారం నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు. 51 విగ్రహాలను అలంకరించిన 51 ట్రాక్టర్లలో ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తిపాటలకు చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇందల్వాయి మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో దేవీ మాత విగ్రహాల నిమజ్జన శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. కోటగిరిలో దేవీమాత నిమజ్జన శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. శోభాయాత్రను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి ప్రారంభించారు.

ఆర్మూర్ పట్టణంలోని వివిధ దుర్గామాత మండపాల్లోని అమ్మవారి విగ్రహాల శోభయాత్ర మంగళవారం సాయంత్రం ప్రారంభమైంది. బుధవారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. పెర్కిట్‌లో శోభయాత్రలో అమ్మవారి వేషధారణలో మహిళల నృత్యాలు, గోల్‌బంగ్లా ప్రాంతంలో అఘోరాల వేషధారణలో యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. దుర్గామాతలను పెర్కిట్, ఆర్మూర్‌లోని గుండ్ల చెరువుల్లో నిమజ్జనం చేశారు.

రెంజల్ మండలంలోని కందకుర్తి, నీలా, తాడ్‌బిలోలి, బాగేపల్లి గ్రామాల్లో దుర్గామాతలను నిమజ్జనం చేశారు. బోధన్ పట్టణంతోపాటు పలు ప్రాంత్రాల నుంచి దుర్గామాత విగ్రహాలను తీసుకువచ్చి కందకుర్తి పుష్కర ఘాట్ల వద్ద ప్రత్యేక పూజలు చేసి గోదావరిలో నిమజ్జనం చేశారు. బోధన్ పట్టణానికి చెందిన సుమారు 50కి పైగా దుర్గామాతలను నిమజ్జనం చేసినట్లు రెంజల్ ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.

## 'ఎన్నికల విధులను నిర్లక్ష్యం చేయొద్దు'


మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్‌కుమార్

ఆర్మూర్, అక్టోబర్25: ఎన్నికల విధులపై నిర్లక్ష్యం చేయొద్దని ఆర్మూర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్మూర్ ఆర్డీవో తిరుక్కోవెల వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని గ్రామీణ, పట్టణ స్థాయిలో మోడల్ కోడ్ నిర్వహణ, అనుసరించాల్సిన విధి విధానాలపై పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్మూర్, ఆలూర్ తహసీల్దార్లు గుండు అర్వార్ శ్రీకాంత్, దత్తాద్రి, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

రెంజల్, అక్టోబర్ 25: వీరన్నగుట్ట అంగన్‌వాడీ –2 కేంద్రంలో చోరీ జరిగినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి బుధవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం తలుపులను పగుల గొట్టి పాలు, పప్పు ప్యాకెట్లను అదే గ్రామానికి చెందిన యువకులు చోరీ చేసినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని సూపర్‌వైజర్ పేర్కొన్నారు.

## వ్యక్తిని అవమానించిన ఇద్దరి రిమాండ్

బోధన్ రూరల్, అక్టోబర్ 25: సాలూరా మండలంలోని హున్సా గ్రామానికి చెందిన బాలాజీ సోయాలను చోరీకి పాల్పడ్డాడంటూ అవమానించిన సంఘటనలో బాధ్యులైన ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ శ్రీనివాస రాజు బుధవారం తెలిపారు. మూడు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన అనేక్, నారాయణ అనే వ్యక్తులకు చెందిన సోయాలను బాలాజీ చోరీ చేశాడంటూ గ్రామంలో అర్ధనగ్నంగా ఊరేగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరిని రిమాండ్‌కు పంపారు.

## 2న మోర్తాడ్‌కు మందకృష్ణ మాదిగ

మోర్తాడ్, అక్టోబర్25: వచ్చేనెల 2న మండల కేంద్రానికి మంద కృష్ణ మాదిగ వస్తారని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మంద ప్రభాకర్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మందకృష్ణమాదిగ సభకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు తరలిరావాలని కోరారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్‌గా ఎన్నికైన సరికెల పోశెట్టిని అభినందించారు.

## అభివృద్ధి కోసం.. వేములకు అండగా నిలవాలి


గాండ్లపేట్‌లో గల్ఫ్ కార్మికులతో మాట్లాడుతున్న కోటపాటి

మోర్తాడ్, అక్టోబర్ 25: మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బాల్కొండ నియోజక వర్గం కనీవిని ఎరగని రీతిలో అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు కోటపాటి నర్సింహనాయుడు అన్నారు. మరింత అభివృద్ధి కోసం మళ్లీ ఎమ్మెల్యేగా ప్రశాంత్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ఆయనకు అండగా నిలవాలని కోరారు. బుధవారం గాండ్లపేట్, పాలెం, మోర్తాడ్, సుంకెట్ గ్రామాల్లో కోటపాటి పర్యటించి రైతులు, గల్ఫ్ కార్మికులను కలిసి మాట్లాడారు. బాల్కొండ నియోజకవర్గాన్ని సిద్దిపేట్, గజ్వేల్‌కు ధీటుగా తీర్చిదిద్దిన ఘనత ప్రశాంత్‌రెడ్డిదేనని అన్నారు. మరోసారి వేములకు అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు మామిడి సౌజన్యా సుమన్, సంతోష్, రాజు, బాలకృష్ణ, రాజు, పలిగిరి రవి, గంగారాం, అజ్జద్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్డీవో

నందిపేట్, అక్టోబర్ 25: మండలంలోని ఆంధ్రనగర్ గ్రామంలో ఇందిరా క్రాంతి పథం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీవో చందర్‌నాయక్ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఏటా వానకాలానికి సంబంధించిన ధాన్యంను మహిళా సమాఖ్య ద్వారా కొనుగోలు చేస్తూ రైతులకు సేవలందిస్తున్నామని అన్నారు. ఆంధ్రనగర్ మహిళ సమాఖ్యను ఆయన అభినందించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. డీపీఎం సాయిలు, ఏపీఎం మాణిక్యం, సీసీ వెంకటేశ్, సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామీణ బ్యాంకులో సంబురాలు

నందిపేట్, అక్టోబర్ 25: వెల్మల్ గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో బుధవారం కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. దేశంలోని 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో (ఆర్ఆర్‌బీ) 2022–23 సంవత్సరానికి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మొదటిస్థానంలో నిలిచిందని వారు తెలిపారు. బ్యాంకు ఖాతాదారులకు సేవల్లో బ్యాంకు మొదటిస్థానంలో నిలువడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ కిషన్, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.


తెలంగాణ గ్రామీణ బ్యాంకులో కేక్ కట్ చేస్తున్న సిబ్బంది


ఆర్మూర్‌లో బతుకమ్మలతో జీవన్‌రెడ్డి, ఆయన సతీమణి రజితారెడ్డి

## ఘనంగా బతుకమ్మ వేడుకలు

ఆర్మూర్, అక్టోబర్25: పట్టణంలోని పెద్దబజార్, చిన్నబజార్‌లో బతుకమ్మ వేడుకలను మంగళవారం రాత్రి నిర్వహించారు. నృత్యాలు చేస్తూ పాటలు పాడుతూ ఆడుతూ బతుకమ్మలను ఆర్మూర్‌లోని గుండ్ల చెరువులో నిమజ్జనం చేశారు. బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ ఆశన్నగారి జీవన్ రెడ్డి, ఆయన సతీమణి రజితారెడ్డి పాల్గొన్ని బతుకమ్మలను ఎత్తుకున్నారు.

## రథయాత్రకు భక్తుల స్వాగతం

మాక్లూర్, అక్టోబర్ 25: అయోధ్యలో భవ్య రామ మందిరాన్ని 2024 జనవరిలో ప్రతిష్ఠించనున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో జనవరి 21న కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞాన్ని దుర్గాప్రసాద్ స్వామి తలపెట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రచార రథం ప్రతి గ్రామానికీ వెళ్లి కరపత్రాల పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని మదన్‌పల్లి, చిన్నాపూర్, మామిడిపల్లి, గుత్ప గ్రామాల్లో బుధవారం రథయాత్ర కొనసాగింది. కార్యక్రమంలో యాత్ర సభ్యులు శేఖర్, గంగోని సంతోష్, నెహ్రూ, స్వామి, దీక్ష భక్తులు, మహిళలు పాల్గొన్నారు.


మామిడిపల్లిలో స్వాగతం పలుకుతున్న భక్తులు